కథానిక

# విలువలు

పంతుల శ్రీరామశాస్త్రి

చిన్నతనంలో తనకు తానే యజమాని అయి చదువు చెప్పించే దాతలేక తాను పడిన అవస్థ నారాయణరావుగారి మనస్సుకి బాగా నాటుకు పోయింది. అంత చదువుకోవాలని సరదా ఉండికూడా తానీ ప్లీడరుగుమాస్తా పనిలో ప్రవేశించవలసి వచ్చింది. ఇందులో అయినా అధికవంతుడు చల్లగా చూడబట్టి ఒకరిని దేహి అని యాచించవలసిన అవసరం లేకుండా గడిచి పోతూంది. కాని, తన కొడుకులకి మాత్రం తనకు పట్టిన దైన్యం పట్టకుండా చూడాలి. ఊరికే తెలివితేటలున్నాయంటే ఏంలాభం? అందకూ తననించే ప్లీడరుగారికి ఈమాత్రం ప్రాక్టీసు వచ్చిందనీ, తాను లేకపోతే ఆయన ఎందుకూ కొరగాడనీ అంటే ఏంలాభం? ఆయన ప్లీడరు, తను గుమాస్తా, ప్రతిమాటకీ చిత్తం చిత్తం అంటూ ఆయన ఇచ్చిన జీతం పుచ్చుకోవలసిన వాడు. పైరాబడి ఉంటేనేం, దానిసంగతి వేరు.

ఏమయినాసరే తన కొడుకులకి విద్యాలోపం వల్ల జీవితంలో లోటు రానీయకూడదు. తరవాత వాళ్ల అదృష్టం. తన తల తాకట్టుపెట్టి అయినా సరే పెద్దవాళ్లిద్దర్నీ అయినా బి.యల్. చదివించాలి, కాక బి.యే. పాసయేక వాళ్ళు వేరే చదువు చదువుకొంటామన్నా తను అడ్డు చెప్పడు. తను అనుభవించిన దైన్యం వాళ్లనుభవించకుండా చెయ్యడం, అంతవరకే తన కర్తవ్యం, తరవాత వాళ్ల ఇష్టం, అదృష్టం. వీళ్లిద్దరికీ చదువులు చెప్పించేస్తే, తరవాత ఆడపిల్లల పెళ్లి ఎలాగో తనతలమీద చేసేలేకపోడు. ఆ తరవాత చిన్నవాళ్లిద్దరి చదువువేళకి పెద్దవాళ్లిద్దరూ చెయ్యందుకోకపోరు.

ఇన్ని ఆలోచనలూ స్పష్టంగా మెరుస్తూనే ఉన్నాయి, వెంకట్రావునీ సుబ్బారావునీ స్కూల్లో వేసేటప్పుడు నారాయణరావుగారి మెదడులో. ఇద్దరూ చదువులో తెలివితేటలయినవాళ్లే అనిపించుకోగలిగినా ఎందుకయినా మంచిదని ప్రయివేటు ట్యూషను కూడా పెట్టేడు. పుస్తకాలకీ బట్టలకీ ఏలోటూ రానిచ్చే వాడు కాడు.

కాని మూడవఫారములో సుబ్బారావు తప్పి పోయాడు. అంతవరకూ నారాయణరావుగారికి కొడుకులు బాగా అంటే స్కూలులో వేసిన మొట్ట మొదట రోజుల్లో చదువుకొంటున్నట్టే లెక్క. కారణాలు చర్చించగా స్కూలుకి సరిగా రావడం లేదనీ, వచ్చినా రౌడీజట్టుతో కలిసి పెంకెతనం చేస్తున్నాడనీ, లెక్కలు మాస్టరుగారిని ఏవో పేర్లు పెట్టి ఉడికించే జట్టులో ప్రథముడనీ తక్కిన పేపర్లలో పాసయినా ఆయన పేపర్లో సున్నా వచ్చినందువల్లే పరీక్ష పోయిందనీ తేలింది.

ఆదివరకు నారాయణరావుగారు కొడుకుల మీద ఎన్నడూ చెయ్యి చేసుకొన్నవాడు కాడు. ఎప్పుడయినా వాళ్లు బాగా చదువుకోలేదని తోచినా చదువుకోకపోతే ఎందుకూ పనికి రాకుండా పోతారనీ, పశువుల్ని కాచుకోవలసి వస్తుందనీ, కాఫీ క్లబ్బులలో నౌకర్లుగా ప్రవేశించవలసి వస్తుందనీ ఏమేమో చెప్పేవాడు మాత్రమే. ఇప్పుడుమట్టుకు ఏదో చదువుకొంటున్నా ఇకముందు చెడిపోకుండా ఉండడానికి పనికి రావాలని ఆయన ఈ ఉపదేశం. కాని, ఒక్కమారుగా తన కొడుకు పరీక్ష తప్పిపోయే వరకూ, అందులోనూ ఇద్దరిలోకీ వీడే తెలివయిన వాడని మొదట మాస్టర్లనేవారు, తను గమనించుకోలేక పోయేడు. ఏమయినా వెధవకి తానేం తక్కువ చేసాడనీ? తెలివితేటలు లేక పరీక్ష పోయిందంటే కొంత. చెడుసావాసాలా? మాస్టర్లని ఉడికించడమా అనుకొంటూ వచ్చి, సరిగా వేళకి ఇంట్లోనే ఉన్న సుబ్బారావుని తానిదివరకు ఊహించనయినా లేనంతగా కొట్టేశాడు.

అంతకు గంటక్రితమే పరీక్షాఫలితాలు తెలిసి, అమ్మచేత మెత్తమెత్తగా చీవాట్లుతిని, తనను

తాను బాగుచేసుకొనే విధానాలను గురించి సుబ్బారావు మనఃపూర్వకంగా సంకల్పించుకొంటున్న సమయమది. అటువంటిసమయంలో ఈ శిక్షపడడంతో, దేశం ఇంతేకదా? ఇంకా కొట్టనీ, నేను చదవనే చదవను అన్న ఒకరకం అలక్ష్యం పొడసూపింది సుబ్బారావులో.

మర్నాటి ఉదయం తొలినాటి దెబ్బలు మరిచిపోయి, మళ్ళీ అన్నయ్యలాగా బుద్ధిమంతుడు కావాలనుకొంటున్న సమయంలో ఇంకొక దెబ్బతగిలింది సుబ్బారావుకి. అన్నయ్య వెంకట్రావుని ఒక్కణ్ణే తీసుకొనివెళ్ళి వాడికి నచ్చిన చొక్కా, నిక్కరు, కొన్నారు నాన్న. పోనీ వాడు తెలివయినవాడు, తానెందుకూ పనికి రానివాడు.

తరువాత కొన్నాళ్ళకి బాగా మొండితేరి పోయాడు సుబ్బారావు. తిట్టికొట్టి నారాయణరావుగారికికూడా విసుగెత్తిపోయింది.

సుబ్బారావు కొన్నాళ్లు బాగా కసరత్తు చేసి, ఒక తాలింఖానా ఏర్పాటు చేశాడు. ఆ వూరు ఒక చిన్న సర్కసువాళ్ళు వస్తే, వాళ్లను తన బలప్రదర్శనంతో పాదలు కొట్టించి వాళ్లలో ఉపనాయకుడుగా చేరి, ఒక సంవత్సరం తిరిగేడు. మొత్తం గుంపులో చీలికలు వచ్చి సర్కసు కంపెనీ అంతరించి పోయింది. కాక మొట్టమొదట ప్రవేశించినప్పటి ఉత్సాహం లేదు సుబ్బారావుకి. ఎలా తగలబడితే అలా తగలడనీ అని ఊరుకొని, అంతా ఎవరిదారి వాళ్ళు చూసు కొన్నాక తనూ బయలుదేరి వచ్చేవాడు రెండు పెద్ద జాతి కుక్కలను వెంట పెట్టుకొని. కొద్దిరోజులు ఇంటి దగ్గర ఉంటూ ఉండేవాడు. తరవాత ఎక్కడికో వెళ్ళిపోతూ ఉండేవాడు. ఇంటికి తిరిగివచ్చినప్పుడల్లా, తమ్ములకీ చెల్లెళ్ళకీ ఏవేవో బట్టలూ ఆటవస్తువులూ తెస్తూఉండేవాడు. తల్లికికూడా ఏ యాభైయో చేతిలో పెడుతూ ఉండేవాడు. అతను ఏమి చేస్తున్నాడో, ఎలా డబ్బు తెస్తున్నాడో ఎవరికీ తెలీదు. కొన్నాళ్ళు ఒక జనపనార వర్తకుడితో తిరిగేవాడు, కొన్నాళ్ళు ఒక వేరుశనగకాయల వ్యాపారస్తుడితో కలిసి మెలిసి ఉండేవాడు. వాళ్ళ తరఫున దేశంలోని అన్ని ముఖ్య పట్టణాలూ తిరిగి వస్తూండేవాడు.

తండ్రికూడా ముఖాముఖిని అనకపోయినా కొడుకుని చూస్తే ఒక విధంగా సంతోషంగానే ఉండేది. పాపం, పోనీ చదువుకోక పోతేనేం, వాడి బ్రతుకు వాడు బ్రతుకుతున్నాడు, అని ఒక విధమయిన జాలితో కూడిన తృప్తి వంటిది కలుగుతూ ఉండేది సుబ్బారావు గురించి. కాని వెంకటరావుని తల్చుకున్నప్పుడల్లా, అతనికి ఎవరెస్టు శిఖరాన్ని ఎక్కుతున్న యాత్రికుడికి ఒక్కొక వంద అడుగులూ మీదికి వెళ్ళి ఇంతేకదా అని చూసుకొంటున్నట్టుండేది. లక్షణంగా బి.యే. పాసయేడు. పాపం, అహర్నిశలు శరీరారోగ్యం పాడయినా లెక్కచెయ్యకుండా చదివేడు. ఇక ఈ రెండేళ్ళూ బి. యల్. అంటూ అయిపోతే!

అవతల వెంకట్రావు బి. యల్. లో ప్రవేశించడమేమిటి, ఇవతల నారాయణరావుగారి ప్లీడరుగారు పోవడమేమిటి, అదివరకల్లా నువ్వింత వాడివి అంతవాడివి, అన్న ప్లీడర్లెవరూ చేరనివ్వలేదు నారాయణరావుగారిని. ఎవడో ఒక అసమర్థుణ్ణి కట్టుకొని పాకులాడ వలసి వచ్చింది.

ఇంకెంత, వాడు ప్రాక్టీసు పెట్టడానికి ఇవి రెండూ, అప్రెంటీస్ కోర్సు ఒక సంవత్సరం మూడు సంవత్సరాలేకదా అని అనిపించింది ఒక మారు. కాని, ఈ మూడు సంవత్సరాలే గడవడమెలాగు? ఇవతల దిన కృత్యం గడుస్తూ అవతల వాడి చదువుకి డబ్బుపంపాలి. ఈనగాచి నక్కలపాలు చేస్తున్నట్టు ఇంతకాలం చేసి చివరకి వాడి చదువు ఆపుచేయించేస్తాడా! ఊఁహూ, ఎలాగో లాగు జరిగితీరవలసిందే.

తన సంపాదన తన నల్లమందుకీ, చుట్టలకీ, కాఫీకి చాలకుండా ఉంది. అప్పుడు బాగా రెండు చేతులా డబ్బు వచ్చేరోజుల్లో అంటే వీటి కింద ఎంత ఖర్చవుతున్నదీ తెలిసేదికాదు. పాపం ఏ ఉద్యోగం లేకుండా ఇంటి ఖర్చంతా వాడే భరించుకొని వస్తూంటే ఇంకా ఏమని అడగడం?

వెంకటరావు దగ్గరనుండి డబ్బు కావాలని ఉత్తరం వచ్చినపుడల్లా నారాయణరావుగారికి ప్రాణగొడ్డంగా ఉండేది. స్నేహితుణ్ణి చేబదులు అడగడానికి వెళ్ళి అప్రస్తుతమయిన మాటలు కొంతసేపు అడి, ఎలాగో సందర్భం కల్పించుకొని అడిగినట్టుగా ఆయన భార్యతో అనేవాడు,

తన అశక్తికి ఎంతో కుంగిపోతూ. అవిడకీ పాపం మొగమాటంగానే ఉండేది. అయినా తప్పదను కొని, ఏ భోంచేస్తున్న సమయంలోనో, సుబ్బారావుతో నెమ్మదిగా అనేది. మొదట్లో కొన్నాళ్లు ఈకుట్టుకల్లా మళ్లీ ఇచ్చేస్తానని చెప్పు అని నారాయణరావుగారనేవారు. ఆమెకూడా, మీ నాన్నకి అందవలసింది ఇంకా అందలేదట. అందగానే ఇచ్చేస్తానన్నారనేది. కాని, రెండుమూడు నెలలతో తమకే మొగమాటంగా తోచి, ఫలానా ఇంత కావాలీ అని అడిగి ఊరుకోడం జరిగేది. ఒక్కొక్కప్పుడు 'సరే అలాగే' అని సుబ్బారావు డబ్బు ఇవ్వడము అయిదారు రోజులు ఆలస్యం అయినప్పుడు దగ్గర ఉండి, తన గొప్పదనాన్ని బాగా చూపెట్టడానికి ఆలస్యం చేస్తున్నాడేమో అని నారాయణరావు గారు అపోహపడిన సమయాలు కూడా ఉన్నాయి. ఏమయినా వాణ్ణి అడక్క తప్పదాయె. సరే ఇంకెంత మరొక్క ఆర్నెల్లు కదా, వాడు వచ్చి ప్రాక్టీసు పెట్టుకొంటే, వాడు చూసుకొంటాడు. నెలకొక అయిదు వందలయినా ఉండకపోతుందా. అన్నీ మరియాగ్గరు రసీదులున్నాయి లెక్కగా, ఒక్క ఏడాదిలో తీర్చేస్తాను. ఇక ఇంటికింద పెట్టినదాని కేమిటి మహా పెంచిపెద్దచేసినందుకు ఆమాత్రం చెయ్యకపోతే ఎల్లాగ? రేపొద్దున్న వాడికి వెయ్యిరూపాయిలు ప్రాక్టీసు వస్తేమాత్రం అదంతా ఇంటికిందా తనతమ్ముళ్ల చదువులకీ చెల్లెళ్లు సారిచీరలకీ పెళ్లిళ్లకీ ఖర్చుపెట్టడా అనుకొని తృప్తిపడతాడు.

ఆ ఆశ కూడా నెరవేరలేదు నారాయణరావుగారికి. వెంకట్రావు పరీక్ష రాసి భార్య సుశీలను వెంటపెట్టుకొని దిగేడు. ఆమె ఇంటర్మీడియేటు చదువుతూండగా స్నేహం కలిసిందిట. అదృష్టవశాత్తూ ఆమె స్వజాతీయురాలే అయింది కూడా. నారాయణరావుగారికి ఒక మూడు నాలుగువేలు కట్నం రాకూడదా అని లోలోపల ఉండిన ఆశకు పెద్ద దెబ్బ తగిలింది. కాని, సర్దుకొన్నాడు ఆం ఒకట్లు ఎంత ఇస్తే మటుకు ఎన్నాళ్లొంటుంది? పురుషుడు బుద్ధిబలం వల్ల ఆర్జించుకోవాలి గానీ అనుకొన్నాడు. తాను ఆ వృత్తికి సంబంధించిన ఎంతో అనుభవం కలిగి ఉండి, కొత్తగా ప్రాక్టీసుపెట్టిన ఎందరో ఏమాత్రమూ రాబడిలేకుండా ఉండటం చూసికూడా, ఏమో తన కొడుకు ప్రాక్టీసు దేదీప్యమానంగా ఉండకూడదా అన్న ఆశను విడిచిపెట్టుకోలేకపోయేడు.

చివరికి ఎలాఅయితేనేం వెంకటరావు బల్ల కట్టేడు. తరవాత కొద్దిరోజులకే సుబ్బారావు పెద్దవీధిలో కిల్లీ సోడాషాపు తెరిచేడు. వెంకటరావు కంటె నారాయణరావుగారికి కష్టమనిపించింది. పెద్దవాడు ప్లీడరయి ఉండగా వీడు కిల్లీ షాపు పెట్టుకోవడమూ అని. అదివరకు ఎలా వస్తున్నాదో ఏమిటో డబ్బు తెలియకుండా వస్తూంటే నారాయణరావు గారికి బాగానే ఉండేది. అంతేకాని, ఇలా నడివీధిలో కిల్లీ దుకాణం పెట్టుకోడమూ అని. కాని, చివరకు అదే ఇంటంతటికీ ఆధారభూతం కావలసి రావడంతో ఆయన నల్లమందు అలవాటు మరికొంత ఎక్కువ చేసుకొని, ప్రాపంచికపు విషయాలు వీలయినంత మరిచిపోవాలని నిత్యం భగవద్గీతాపురాణాలు చదువుకోవడంలోపడ్డాడు.

ఎప్పుడో వారానికోమాటు తిండికి వస్తాడు. ఎక్కడ ఉంటున్నాడో ఏమిటో. ఇంటి ఖర్చంతా వాడొక్కడి తలమీదే నడుస్తో, వాడి సుఖం చూసేవాళ్లా లేదు అని తల్లికి ప్రాణం కటకటలాడేది. ఆమె ఇంటికి వచ్చినప్పుడల్లా పెళ్ళిచేసుకోమని చెవినిల్లుకట్టుకొనిచెప్పగా అతను ఉండలేక అన్నాడు: 'నాకు పెళ్ళయిందమ్మా, అది వేరేఇంట్లోఉంది. దాని పెళ్ళయింతరవాతే తిరగడం ఇష్టంలేక దుకాణం పెట్టే' అని.

ఎలాగయితేనేం తల్లి ప్రోద్బలంవల్లనూ, అవతల విశాలకూన్నా ఒంటరిగా ఉండడం అనిష్టంకావడంవల్ల తీసుకొచ్చి ఇంట్లోనే పెట్టేడు.

ఒక రెండు నెల్లుపోయేక విశాల అంది భర్తతో - 'నేనేపొరపాటు పడ్డాను. ఈ ఇంట్లో ఒక మీఅమ్మగారు తప్ప తక్కిన అంతా చిత్రమయిన మనుషులు. వాళ్ళకట్టే విలువలు వాళ్లకే తెలియాలి. మనకి దుకాణం ఉండడం పరువు తక్కువ. ఆ మాట చెప్పుకోవడానికి సిగ్గు. కాని, దానిమీద వచ్చేడబ్బుమాత్రం కావాలి. మరొకందుకు కాదు గాని, దమ్మిడీ ఆర్జన లేకపోయినా, ఆయనకీ ఆయన భార్యకీ అంతగర్వమెందుకో? మళ్ళీ మనం ఎక్కడ అధికారం

చలాయిస్తున్నారో అని అనుమానం. ఆయన ఎప్పుడో ఏదో సభలో మాట్లాడారట. ఏవో వ్యాసాలు రాశారట. ఇక వాటి గొడవ ఇంతా అంతా కాదు. ఈ జబ్బు చిన్న పిల్లలవరకూ పట్టుకొంది. ఆవేళ నేను ఏదో పుస్తకం తియ్య బోతూంటే, అదా, అది మా ఇంగ్లీషు డ్రామా అంది. నేనూ బి. ఏ. వరకూ చదువుకొన్నానని ఆవిడ కేం తెలుసు? ఇటువంటి వాళ్ళను కొంత కాలం వాళ్ళసత్తా తెలిసి వచ్చేట్టు వేరే ఉండ నియ్యాలి. ఏం మీరుమాత్రం సూట్లు వేసుకోని పని లేకుండా తిరగలేరా? నాకు ఒకొక్కప్పుడు నిజంగా చాలా చిరాకు వేస్తుంది.'

మధ్యలో ఆమెను ఆపి, సుబ్బారావు 'ఇంకా నువ్వు చెప్పవలసింది రాత్రి చెప్పుదువుగానిలే. మరి నా మాట విను. వాళ్ళకి గర్వం అన్నావే అసలది నీలోనూ బోలెడుంది. కాక, వాళ్ళదది గర్వమే కాదు, చేతకాని తనాన్ని అసమర్థతనీ ఒప్పుకోలేక పడే మొగమాటం; ఏమయినా మా అన్నయ్య బాగా చదువుకొన్నాడు. నీకే మయినా చికాకుగా ఉంటే మళ్ళీ వేరే పోదాం గాని, మరేం మాటలు మిగలకు, అనవసరపు కల్లోలాలు వస్తాయి' అన్నాడు.

# సంఘం తరఫున పశ్చాత్తాపం

కొత్తపల్లి లలిత

తల్చుకొంటే కన్నీళ్లు వస్తున్న విప్పటికీ.

ఆనాడు... ఆ రిక్షావాడు——

నిజంగా ఎంత పాపు దినమో - అనుకుంటూ నిస్పృహ. లేకపోతే ఒక్క జట్కాకూడా దొరక్కపోవడం. ఆలస్యం చేస్తే కాలేజీ వేళమించి పోతుంది. సరేనని ఆరిక్షాలో కూర్చున్నాను.

గుంటలూ, మిట్టలూ, రాళ్ళూ - ఇన్నిటినీ దాటుతూ తీసుకెళుతున్నాడు. ఎందుకో అప్రయత్నంగా వాడి కాళ్ళకేసి చూశాను - ఎఱ్ఱగా మొద్దుబారి చీరుకొనిపోయి ఎండిన మోడుల్లా చూడటానికసహ్యంగా వున్నది...వాని పెళ్ళాని కీలాంటి కాళ్లు మాస్తే విడాకులివ్వాలనిపించదేమో!

'ఎటువైపమ్మా!' అంటూండే వాడి ముఖాన్ని పరిశీలనగా చూశాను... అబ్బ - ఎంత అందంగా భీకరంగా వున్నదో. ఆ మనిషి కళ్లలో నిస్పృహ, దానితో పాటు కడుపులో ఆకలిమంటలచే భుగభుగలాడే ఒక తరహా అయిన వికృతమైన చూపు - నా కళ్ళల్లోకి చూసింది... అడివిలాంటి నల్లని జుట్టులోనుంచి చమట పెదవులమీదుగా గుండెల మీదికి ప్రవహిస్తోంది. కండలు తేరిన చేతులు. ఎంత మోటుదనం. కాని ఆ భీభత్సంలో ఎంత అప్రతిహతమైన అందం!

మళ్లీ సందు తిరిగాము. పల్లమునుంచి ఎత్తుకి ఊపిరి బిగపట్టి బలమంతా కాళ్లమీదాన్పి పైకి లాగటానికి ప్రయత్నిస్తున్నాడు - అవును. ఇప్పుడు తెలిసింది - ఆ కాళ్లు ఎందుకట్లాగైనవో - లేకపోతే సూటూ బూటూ వేసికొనే అందరి కాళ్ళవలెనే వీడివికూడా సుకుమారంగానే వుండేవి. కాని—— సిగ్గుతో ఉక్కిరిబిక్కిరయ్యాను - వాని అవస్థకు కన్నీళ్లు పర్యంతము వస్తున్నవి.

'ఏయ్. అబ్బీ - ఇటు చూడు - నిన్నే. నేను దిగుతానుండు' అంటూ మెల్లిగా దిగాను కిందికి.

ఆశ్చర్యంతో ఆయాసంతో ఒక్క నీరసమైన చూపుతు నావైపు పారద్రోలినా కేసి చూస్తూనిల్చు న్నాడు. మెల్లిగానవ్వుతూ పావలాకెబదులుఎనిమిదణాల బిళ్ళ వాని చేతిలో పెట్టాను 'ఇక చాలును దగ్గరకొచ్చానుగా నడిచి వెళ్ళగలనులే, ఈ కాస్త దూరం' అన్నాను. అర్థం కానట్టుగా చూసి... వంగి రిక్షాను ఎత్తుకొని ముందుకు సాగాడు గంట మ్రోగించుకొంటూ - కాని ఆ ఒక్క క్షణం... అనిర్వచనీయమైనది. ఆ ఎనిమిదణాలు చూసుకొని నావైపు దీర్ఘంగా చూడటం, కృతజ్ఞతతో కాదు, మరోలా - వెళ్లిపోతుంటే నిల్చో లేక పోయాను. పాపం - ఒక జంతువులా బండిని లాక్కొని ఆ కాళ్లు చీరుకొని పోయేలా - జీవితం గడపాలా! లేకపోతే గడవదా? ఆ రిక్షావాని మీద ఎవ్వరికీ జాలిలేదా? ఇంత చేస్తే రోజు గడవదే - ఎంత అన్యాయం. మానవుణ్ని పశువు కన్నా హీనంగా తోటి మానవుడు వినియోగించుకోవడమా? ఆ రిక్షావాని జీవిత మింతేనా?